ఈనాడు చిత్తూరు



వేడుకగా శ్రీవారి రథోత్సవం.. తరలివచ్చిన భక్తజనం

రథంపై పథగామి.. అశ్వంపై విశ్వాంతర్యామి



అశ్వ వాహనంపై కల్కి అవతారంలో విహరిస్తూ..

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామివారికి ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవ వేడుకగా నిర్వహించారు. ఉదయం 7.00 నుంచి 8.50 గంటల వరకు రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. **కల్కి అవతారంలో కరుణించి..** రాత్రి స్వామి అశ్వవాహనంపై కల్కి అవతారంలో ఊరేగారు. అశ్వ వాహనాధిరూఢుడై కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలి దోషాలకు దూరంగా ఉండాలని ప్రబోధించారు.



చక్రస్నానానికి సర్వం సిద్ధం..

శ్రీవారి చక్రస్నానం శనివారం ఉదయం 6-9 గంటల మధ్య జరగనుంది. రాత్రి 7-9 గంటల మధ్య నిర్వహించే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.



సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల: టోకెన్లు లేకుండా తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 టికెట్లు కలిగిన వారికి 3 గంటలు పడుతోంది. గురువారం శ్రీవారిని 60,775 మంది దర్శించుకున్నారు. రూ.3.88 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

భక్తిశ్రద్ధలతో సేవలందించాలి

తిరుమల, న్యూస్‌టుడే: రోజూ గరుడ సేవగా భావించి అత్యంత భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తించాలని తితిదే ఈవో జె.శ్యామలరావు అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం జరిగే చక్రస్నానం ఏర్పాట్లపై ఈవో, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి స్థానిక బ్రహ్మోత్సవం సెల్‌లో శుక్రవారం సమీక్షించారు. పుష్కరిణిలో ప్రతి 20 మీటర్ల దూరానికి ఒక ఈతగాడిని, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు 40 లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేసినట్లు సీవీఎస్‌వో శ్రీధర్ తెలిపారు.

దసరా తర్వాత.. పల్లె దశ తిరిగేలా..

- తొలి విడతలో సీసీ రోడ్లు, మినీ గోకులాల నిర్మాణం
- సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం

ఈనాడు, చిత్తూరు: ఐదేళ్ల వైకాపా పాలనలో పల్లెల్లో సమస్యలు రాజ్యమేలాయి.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయని.. సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయని ప్రజలు పదేపదే ఫిర్యాదు చేసినా నాటి పాలకులు పట్టించుకోలేదు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో సౌకర్యాలు కల్పించాలని వినతులు ఇచ్చినా బుట్టదాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం పల్లె దశ మార్చేందుకు కంకణం కట్టుకుంది. ఇటీవల జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన పనులను పట్టాలెక్కించనుంది. ఇందులో భాగంగా ఈ నెల 14 నుంచి 20 వరకు 'పల్లె పండుగ' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు.

రహదారుల రూపు మార్చేందుకు..

700 పంచాయతీల్లో రూ.126.03 కోట్లతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆమోదం లభించింది. మొత్తంగా 2,208 పనులు చేయనున్నారు. ఇందులో అత్యధికంగా సీసీ రహదారులే ఉన్నాయి. రూ.70.47 కోట్లతో 1,356 పనులు చేయనున్నారు. 2014- 19 మధ్య తెలుగుదేశం అధికారం ఉన్న సమయంలో ఎక్కువగా ఈ రోడ్లు వేశారు. వైకాపా చేతికి పాలనా పగ్గాలు వచ్చాక రహదారుల నిర్మాణం, మరమ్మతులపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. ఫలితంగా పల్లెల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ నేపథ్యంలోనే ఎన్డీయే సర్కార్ వీటికి ప్రాధాన్యం ఇచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో కలిపి 150 కి.మీ వరకు రహదారుల ముఖచిత్రం మారనుంది. వీటితోపాటు రూ.7.78 కోట్లతో బీటీ రోడ్ల పనులు మొదలుకానున్నాయి.




పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీలో దెబ్బతిన్న సీసీ రోడ్డు

21 అంగన్‌వాడీ భవనాలు

పశ్చిమ ప్రాంతంలో ఇప్పటికీ చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. అవి దెబ్బతిని వర్షాలు పడినప్పుడు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అద్దెలు చెల్లించలేకపోతున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని 21 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి గ్రామసభల్లో తీర్మానం చేశారు. రూ.3.35 కోట్లతో వీటిని చేపట్టనున్నారు. చెరువులకు నీరు వచ్చే కాల్వల జంగిల్ క్లియరెన్స్, ఇతర మరమ్మతులకు రూ.11.21 కోట్లు ఖర్చు చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి వీటన్నింటినీ ఓ కొలిక్కి తేవాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది.

పశుపోషకుల కోసం 503 షెడ్లు

తొలి విడతలో రోడ్లు, మినీ గోకులాల కింద షెడ్లు నిర్మించేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ పాలన, సాంకేతిక అనుమతులు ఇచ్చారు. సంక్రాంతి నాటికి వీటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పశుపోషకుల కోసం రూ.11.30 కోట్లతో 503 షెడ్లు నిర్మించనున్నారు. కుప్పం నియోజకవర్గంలోనే 300కు పైగా మినీ గోకులాలు మంజూరు చేశారు. ఇప్పటికే ఇక్కడ పనులు ప్రారంభించారు. రెండో విడతలో డ్రైనేజీలపై దృష్టి సారించనున్నారు. రూ.17.73 కోట్ల వ్యయంతో 220 డ్రైన్లు అందుబాటులోకి తీసుకురానున్నారు.



రైతుబజారులో తక్కువ ధరకే నిత్యావసరాలు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరల నియంత్రణలో భాగంగా పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు రైతుబజారులో తక్కువ ధరకే సరకులు విక్రయిస్తున్నామని ఎస్టేట్ అధికారి అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కిలో కందిపప్పు రూ.150, ఉద్దిపప్పు రూ.125, పెసరపప్పు రూ.120, పచ్చిశనగపప్పు రూ.102, వేరుసెనగ గింజలు రూ.115, చక్కెర రూ.43, లీటరు నటరాజ్ నూనె రూ.127, గోల్డ్ విన్నర్ నూనె రూ.133, సన్‌ఫ్లవర్ నూనె రూ.129, సోనామసూరి బియ్యం కిలో రూ.50కు విక్రయిస్తున్నామని చెప్పారు.

చెడుపై విజయానికి ప్రతీక విజయదశమి

చిత్తూరు కలెక్టరేట్, చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి పనిలో అందరూ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో సిరి సంపదలతో విలసిల్లాలని జేసీ విద్యాధరి, డీఆర్‌వో పుల్లయ్య అభిలషించారు. ● విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్పీ మణికంఠ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చెడుపై మంచి సాధించి విజయానికి సంకేతంగా విజయదశమి పండగను అందరూ ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

తిరుమలలో వర్షం



ఆలయం వద్ద కురుస్తున్న వర్షం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ శుక్రవారం సాయంత్రం తిరుమలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఎడతెరపి లేకుండా కురవడంతో శ్రీవారి ఆలయం నుంచి బయటకు వచ్చిన భక్తులు, అఖిలాండం వద్ద భక్తులు ఇబ్బంది పడ్డారు. వర్షంలో తడిసి కొందరు ముద్దయ్యారు. ఆలయ మాడవీధులు, తిరుమల వీధుల్లో వర్షపు నీరు ప్రవహించింది. వర్షం తగ్గడంతో శ్రీవారి రాత్రి వాహన సేవకు వచ్చిన భక్తుల ఇబ్బందులు తొలిగాయి.




బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద వేచి ఉన్న భక్తులు

పాముకాటు బాధితులను తమిళనాడు పంపుతారా?

వైద్యుల తీరుపై ఎంపీ దగ్గుమళ్ల ఆగ్రహం

పెనుమూరు, శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: 'పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వస్తే తమిళనాడుకు పంపడమేంటి? అంతదూరం వెళ్లేలోగా బాధితులు మరణిస్తారు కదా.. ఇక్కడెందుకు వైద్యసేవలు అందించడం లేదు' అంటూ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు నిర్లక్ష్యం వహించడం భావ్యం కాదన్నారు. శ్రీరంగరాజపురం, ఆరిమాకులపల్లె పీహెచ్‌సీలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. హాజరు పట్టికలో ఏడుగురు సంతకాలు చేసినా.. వారు విధుల్లో లేకపోవడాన్ని తప్పుబట్టారు. సంతకాలు పెట్టి విధుల్లో లేని సిబ్బంది లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. సీహెచ్‌వో శ్రీనివాసులు ఎక్కడ పనిచేస్తున్నారో విచారించి నివేదిక ఇవ్వాలని చెప్పారు. తెదేపా ఎస్సార్‌పురం, పెనుమూరు, మండలాల అధ్యక్షులు గంధమనేని జయశంకరనాయుడు, రుద్రయ్యానాయుడు, నాయకులు హేమాద్రి యాదవ్, జయచంద్రనాయుడు, శ్రీధర్‌యాదవ్, నిరంజన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరిమాకులపల్లె పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

నేడు సాహితీ స్రవంతి

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని మామిడి భవనంలో 'త్రిపురనేని రామస్వామి చౌదరి-విప్లవ సాహిత్యం' అంశంపై శనివారం సాహితీ స్రవంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సహదేవనాయుడు తెలిపారు.





విద్యుత్తుశాఖ నూతన సర్కిల్‌కు అధికారుల నియామకం

చిత్తూరు (మిట్టూరు): చిత్తూరులో నూతన విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయానికి విభాగాల వారీగా అధికారులను నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు సర్కిల్ విజిలెన్స్ విభాగం(డీపీఈ) ఈఈగా షణ్ముగం, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారిణి(ఏఏవో)గా డి.శివకుమారి, సర్కిల్ టెక్నికల్ ఈఈగా బి.జగదీష్ నియమితులయ్యారు. అకౌంట్స్ అధికారిగా పి.ప్రసన్నఆంజనేయులు, పర్సనల్ ఆఫీసర్(పీవో)గా ఎస్.జె.రెడ్డెప్ప, కన్‌స్ట్రక్షన్ ఈఈగా ఎస్.అమర్‌బాబు, ఎంఆర్‌పీ, ఎంఆర్‌టీ ఈఈగా కె.వాసుదేవరెడ్డిని నియమించారు. కన్‌స్ట్రక్షన్ డీఈఈలుగా మాధవరావు, జ్ఞానేశ్వర్‌ను, హెచ్‌టీఎం, సీటీఎం మీటర్స్ విభాగానికి జి.కమలాకర్‌రావు, హెచ్‌టీ, సీటీ మీటర్స్ విభాగానికి సిరాజుద్దీన్, ప్రొటెక్షన్ విభాగానికి ఎం.ప్రభాకర్‌ను నియమించారు.

లేఖ రాయండి.. పతకం గెలవండి

తపాలా శాఖ ఆధ్వర్యంలో పోటీలు



చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు, పౌరుల్లో దాగున్న లేఖరచన నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తపాలా శాఖ కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ఫిలాటెలీ(తపాలా బిళ్లల సేకరణ) ప్రమోషన్‌లో భాగంగా లేఖరచన పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. 18 ఏళ్ల లోపు, 18 ఏళ్లు పైబడిన విభాగాల్లో లేఖరచన పోటీల్ని నిర్వహించి ఉత్తమ రచనలకు బహుమతుల్ని అందించనున్నట్లు తపాలా శాఖ పేర్కొంది. ఆ వివరాలేమిటో తెలుసుకుందాం.

ఈ అంశంపై పోటీ..

ఫిలాటెలీ ప్రమోషన్‌లో ఉన్న కార్యకలాపాల్లో ఒకటిగా ధాయి అఖర్ లెటర్ రైటింగ్ క్యాంపెయిన్ నిర్వహించాలని తపాలా శాఖ ప్రతిపాదించింది. దీని కోసం The joy of writing : Importance of letters in a Digital age//'లేఖరచనలో ఆనందం: డిజిటల్ యుగంలో లేఖ రచన ఆవశ్యకత' అంశంపై లేఖ రచన చేయాల్సి ఉంటుంది. ఆంగ్లం/హిందీ/తెలుగు భాషల్లో లేఖ రాయాలి.

ఇన్‌ల్యాండ్ లెటర్/ఎన్వలప్‌లో రచనలు.. 18 ఏళ్లలోపు వారు ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డ్ కేటగిరీ, ఎన్వలప్ కేటగిరీలో లేఖ రచన చేయొచ్చు. 18 ఏళ్లు పైబడినవారు ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డ్ కేటగిరీ, ఎన్వలప్ కేటగిరీలో లేఖ రచన చేయొచ్చు.

షరతులు ఇలా.. ఎన్వలప్ కేటగిరీలో రచన 1000 పదాల కన్నా ఎక్కువ ఉండరాదు. ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డు(ఐఎల్‌సీ)లో 500 పదాల కన్నా ఎక్కువ ఉండరాదు. చేతితో రాసిన లేఖలు పంపాలి.

సద్వినియోగం చేసుకోవాలి.. లేఖ రచన పోటీలను విద్యార్థులు, యువత, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పోటీల గురించి వివరాల కోసం సమీపంలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించండి.

-లక్ష్మన్న, తపాలా సూపరింటెండెంట్, చిత్తూరు డివిజన్

దరఖాస్తుకి చివరి తేదీ..

రాసిన లేఖల్ని డిసెంబరు 14లోగా చిత్తూరు ప్రధాన తపాలా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, చిత్తూరు డివిజన్, చిత్తూరు-517001 చిరునామాకు పంపాలి. ఐఎల్‌సీ/ఎన్వలప్‌పై ఎంట్రీ ఫర్ ధాయి అఖర్ 2024-25 అని లిఖించి ఉంచాలి. ఉత్తరాల్ని రిజిస్టర్ పోస్ట్/స్పీడ్ పోస్ట్‌లో పంపాలి.

బహుమతులిలా..

బహుమతి వర్గం	సర్కిల్ స్థాయిలో	జాతీయ స్థాయిలో
మొదటి బహుమతి	రూ.25 వేలు	రూ.50 వేలు
ద్వితీయ బహుమతి	రూ.10 వేలు	రూ.25 వేలు
తృతీయ బహుమతి	రూ.5 వేలు	రూ.10 వేలు

శ్రీవారిని స్మరిస్తూ.. భక్తుల సేవలో తరిస్తూ

తిరుమల, న్యూస్‌టుడే: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తన సంకీర్తనలతో అభిషేకించిన తాళ్లపాక అన్నమాచార్యులు ఎన్నో కీర్తనలు రచించి స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. అన్నమాచార్య వంశీయుల కుటుంబంలో పుట్టిన వారు ఇప్పటికీ స్వామివారికి రోజూ సంకీర్తన కైంకర్యం కొనసాగిస్తున్నారు. శ్రీవారికి సంకీర్తనా కైంకర్యమే కాకుండా తరతరాలుగా సామాన్యులకు అన్నప్రసాదాలు, పానీయాలను అందిస్తూ వస్తున్నారు.



వాహన సేవలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న తాళ్లపాక హరినారాయణాచార్యులు

అన్నమాచార్య కుటుంబం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సేవలోనూ పునీతులవుతోంది. ప్రతి బ్రహ్మోత్సవం సమయంలో వాహన సేవలకు వచ్చే భక్తులకు, కళాకారులకు, ఉద్యోగులకు అవసరమైన మజ్జిగ, పానకం, బాదంపాలు అందిస్తున్నారు. ఏ టైప్ క్వార్టర్స్ వెనుక భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేస్తున్నారు. అన్నమాచార్యుల కుటుంబంలోని వంశస్థుడైన చిన్న తిరుమలాచార్యులు ప్రారంభించారు. కొంతకాలం ఆగినా.. తర్వాత తాళ్లపాక అనంతాచార్యులు తిరిగి ప్రారంభించారు.

12వ తరం కొనసాగిస్తున్నాం: తాళ్లపాక హరినారాయణాచార్యులు

మా ముత్తాత అన్నమాచార్యులు సంకీర్తనలతో స్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేశారు. అదే స్ఫూర్తితో మా ముత్తాతలు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు దాహార్తి తీరుస్తూ, వారికి అన్నప్రసాదాలు అందిస్తూ తమ జీవితాన్ని స్వామివారికి, ఇటు భక్తుల సేవకు కేటాయించారు. అన్నమాచార్యుల వంశంలోని 12 తరం వారుగా మేము ఈ వితరణను కొనసాగిస్తున్నాం. నాతోపాటు తాళ్లపాక నాగభూషణాచార్యులు, తాళ్లపాక రాఘవ అన్నమాచార్యులు వితరణ చేస్తున్నారు. భవిష్యత్‌లోనూ కొనసాగిస్తూనే ఉంటాం.

ఉత్కంఠగా చెస్ పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

పుంగనూరు గ్రామీణ: స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చెస్ పోటీలు శుక్రవారం ఉత్కంఠగా సాగాయి. అండర్-15 విభాగంలో జరిగిన పోటీలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ పుంగనూరు నోబుల్ సహకరించారు. బాలికల విభాగంలో స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎ.నవ్య, ఎస్.రోహిత, కె.సాయి నవ్యశ్రీ, ఎస్.జాహ్నవి, బాలుర విభాగంలో గూడూరుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.సతీష్, టి.గౌతమ్, టి.హరీష్ నాగ, స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వినయ్ కుమార్ విజేతలుగా నిలిచారు. వీరు ఈనెల 15 నుంచి 17 వరకు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని గురుకులం ఆచార్య మణికంఠ తెలిపారు.

11 మండలాల్లో వర్షం

చిత్తూరు(మిట్టూరు): అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి జిల్లాలోని 11 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. వెదురుకుప్పంలో 24.4మి.మీటర్లు, గుడిపాల 20.2, ఎస్ఆర్‌పురం 12.6, నింద్ర 11.4, కార్వేటినగరం 9.2, తవణంపల్లె 9 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195

'మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు'

నగరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో సీఎం చంద్రబాబు ముందడుగు వేశారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలో అన్న క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం పునఃప్రారంభించి మాట్లాడారు. పేదల ఆకలి తీర్చడానికి, రూ.5కే భోజనం అందించాలనే ఆశయాన్ని అమలు చేయడం నిజంగా గొప్ప విషయమన్నారు. ఇక్కడకు వచ్చిన ప్రజల ఆదరణ చూస్తుంటే ఈ ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అనంతరం ఆయన. . వచ్చిన వారికి భోజనం వడ్డించడమేకాక తానూ భోజనం రుచి చూశారు. కమిషనర్ కృష్ణారెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, కార్యదర్శి శ్రీనివాసన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్‌రెడ్డి, పురుషోత్తం, జిల్లా కార్యదర్శి బాలాజీ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజీ, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు, జనసేన నాయకురాలు కోమలి పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

గణనాథుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం ఈవో పి.గురుప్రసాద్, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రవి, కాణిపాకం ఎస్సై ధరణీధర, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



జస్టిస్ జ్యోతిర్మయికి జ్ఞాపిక అందిస్తున్న ఈవో గురుప్రసాద్

వినాయకుడి సేవలో ఐవోసీఎల్ ఛైర్మన్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని ఐవోసీఎల్ ఛైర్మన్ వి.సతీష్‌కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో పి.గురుప్రసాద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ మర్యాదల ప్రకారం శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.




సతీష్‌కుమార్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో గురుప్రసాద్

మట్టికీ, మనిషికీ బంధం చెరిగిపోదు

తిరుపతి(జీవకోన, బైరాగిపట్టెడ): మట్టికీ.. మనిషికీ బంధం ఎన్నటికీ చెరిగిపోదని రచయిత, కవి డాక్టర్ త్యాగదుర్గం మౌని అన్నారు. తిరుపతి నగర పరిధి కరకంబాడి మార్గంలోని ఎస్వీ కాలనీలోని నాయుని కృష్ణమూర్తి ప్రాంగణంలో శుక్రవారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మౌని కవితా సంపుటి 'మట్టి.. చెట్టు.. మనిషి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మౌనిని రచయితల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. రచయితలు పల్లెపట్టు నాగరాజ, తిరువాయిపాటి రాజగోపాల్, డాక్టర్ మన్నవ గంగాధర్‌ప్రసాద్, సాకం నాగరాజు, వాకాప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, నెమిలేటి కిట్టన్న, టి.చిట్టిబాబు, టి.రాజేంద్రప్రసాద్, జయరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అసుర సంహారిణి.. శుభంకరి

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: అసుర సంహారిణి.. శుభంకరి అంటూ అమ్మవారి నామాలతో బోయకొండ గంగమ్మ ఆలయం మార్మోగింది. దసరా మహోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం ఆదిశక్తి మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించి ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు. ఈవో ఏకాంబరం ఉభయదారులను సత్కరించారు.



మహిషాసురమర్ధిని అలంకారంలో బోయకొండ గంగమ్మ





▸ కాణిపాకం: దుర్గాదేవిగా మరగదాంబిక దేవి ▸ బంగారుపాళ్యం: మహిషాసురమర్ధిని అలంకరణలో బోయకొండ గంగమ్మ

దుర్గాదేవిగా మరగదాంబిక

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ మరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి, భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో పి.గురుప్రసాద్, ఏఈవో టి.రవీంద్రబాబు, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, భక్తులు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వజ్రాలపురం బోయకొండ గంగమ్మ భక్తులకు మహిషాసురమర్ధిని అలంకరణలో దర్శనమిచ్చారు. మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన చంద్రాచ్చారి కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, రాజేంద్రనాయుడు, ఆలయ మేనేజర్ మొగిలప్ప భక్తులకు వసతులు కల్పించారు.

కౌన్సిలర్ తీరు వివాదాస్పదం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఓటమి తర్వాత కూటమి ప్రభుత్వానికి మద్దతు పలుకుతూ పలువురు వైకాపా కౌన్సిలర్లు సీఎం నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో తెదేపాలో చేరారు. అందులో 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అలీ సైతం ఉన్నారు. అయితే ఆయన శుక్రవారం వైకాపా శ్రేణులు నిర్వహించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. పురపాలిక ఛైర్మన్ సుధీర్ ఆధ్వర్యంలో కేకు కట్ చేయగా.. సయ్యద్ అలీ అక్కడ అంతా తానై వ్యవహరించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ సయ్యద్ అలీ

యథేచ్ఛగా మూగజీవాల అక్రమ రవాణా

- ☛ సంతలోనే క్రయవిక్రయాలు
- ☛ నిద్రావస్థలో యంత్రాంగం

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో మూగజీవాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సంతల ముసుగులో వేలాది ఆవులు, దూడలు, ఎద్దులు కబేళాలకు తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. మూగజీవాల మాంసం పొరుగు దేశాలకు ఎగుమతి చేసే రాష్ట్రాలకు ఇక్కడి నుంచి తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాను నిరోధించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. నాడు అమ్మలా పాలిచ్చిన పశువు నేడు మార్కెట్లో బలిపశువు అవుతోంది. కరవు కారణంతో 10 శాతం మూగజీవాల విక్రయాలు జరిగితే 90 శాతం భక్షించేందుకు చేస్తున్న వ్యాపారాలే అనడంలో సందేహం లేదు.

దక్షణాదికి తరలిస్తూ..

పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందుకు పుంగనూరు పశువుల సంత కేంద్రం కావడం బాధాకరం. ఇక్కడ ప్రతి బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సంత నిర్వహిస్తారు. లారీలు, టెంపోలు, ఆటోల్లో తరలుతున్న మూగజీవాల రోదన చూస్తే కళ్లు చెమ్మగిల్లుతాయి.



పశువులు తరలించడానికి సిద్ధం చేసిన వాహనాలు

జేబులు నింపుకొంటున్నారు

జంతు పరిరక్షణ చట్టం ప్రకారం పశు వధ చట్టరీత్యా నేరం. అయినా పుంగనూరు పశువుల సంతలో వ్యాపారం జోరుగా సాగుతోంది. వట్టిపోయిన, అనారోగ్యానికి గురైన, గర్భం దాల్చని మూగజీవాలను రైతుల నుంచి తక్కువ మొత్తానికి కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. వాటి మాంసంతో పాటు కొమ్ములు, ఎముకలు, చర్మం ఉపయోగపడటంతో అక్రమార్కులు ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందుతున్నారు.


నిబంధనలు.. ప్చ్

గతంలో లేగదూడలను మార్కెట్‌లోకి అనుమతించేవారు కాదు. అలాగే టెంపో, లారీలో నిబంధనల ప్రకారం పశువులను ఎక్కించేవారు. లారీల్లో కనబడేలా తరలించేవారు. ప్రస్తుతం మార్కెట్‌లో లేగదూడలు అధిక సంఖ్యలో విక్రయిస్తున్నారు. కబేళాలకు తరలించే పశువులను ఒక్కో టెంపోలో 20 వరకు తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాను నివారించాల్సిన ఏఎంసీ, పశుసంవర్ధక, పోలీసులు, గోసంరక్షణ సమితి నిర్వాహకులు పట్టీపట్టనట్లు ఉన్నారు. పాడి ఆవులకు జన్మించే కోడెదూడలను రైతులు ఒకటి రెండు రోజుల్లోనే సంతకు తెచ్చి విక్రయిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

స్థానిక సంత నుంచి కబేళాలకు పశువులు తరలిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో విచారించి పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు పంపుతా. వారి సూచనల మేరకు మూగజీవాల అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం.

- గోపి, కార్యదర్శి, ఏఎంసీ, పుంగనూరు









చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి


ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌కు ప్రసాదం అందిస్తున్న గురుప్రసాద్

వినాయకుడి సేవలో శ్రీకాళహస్తి ఆలయ ఈవో

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దేవదాయ శాఖ ఆర్జేసీ, శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో పి.గురుప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

16న మండల సమావేశం

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10.30గంటలకు కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని ఎంపీడీవో నాగరాజు శుక్రవారం తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

27న పద్య పోటీలు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న విద్యార్థులకు జాతీయ స్థాయి పద్యాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు శుక్రవారం తెలిపారు.


● కలెక్టరేట్: రాజరాజేశ్వరీ దేవిగా పొన్నియమ్మన్ ● చిత్తూరు(క్రీడలు): డీఐరోడ్డులోని అంకాళ పరమేశ్వరి ఆలయంలో సరస్వతీదేవిగా.. ● నగరి: మహిషాసురమర్దనిగా దేశమ్మ ● జీడీనెల్లూరు: వేపంజేరిలో రథోత్సవంలో లక్ష్మీనారాయణస్వామి ● సంతపేట: కట్టమంచి షిర్డీ సాయిబాబా మందిరంలో మహిషాసురమర్దని అలంకరణ ● పుత్తూరు: శ్రీలక్ష్మీకనక దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


● కార్వేటినగరం: మహిషాసుర మర్దని అలంకరణలో బంగారమ్మ ● పుత్తూరు: మహిషాసుర మర్దనిగా ఓంశక్తి అమ్మవారు ● పెనుమూరు: రామాపురంలోని మహిషాసుర మర్దని అలంకారంలో ప్రసన్న పార్వతీదేవి ● తవణంపల్లె: మహిషాసుర మర్దని అలంకరణలో అన్నపూర్ణాదేవి

జయజయహే.. మహిషాసుర మర్దని

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా సాగాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తుల్ని కటాక్షించారు. సంతపేటలోని జీజేఎం సుఖీభవ హాల్‌లో నవచండీ యాగం ముగింపులో భాగంగా శనివారం మహా పూర్ణాహుతి పూజలు జరగనున్నాయి.


● పుత్తూరు: మహిషాసుర మర్దనిగా గోవిందమ్మ ● విరాల: దుర్గాదేవి అలంకరణలో పాలేటి గంగమ్మ ● చిత్తూరు(క్రీడలు): కొంగారెడ్డిపల్లెలోని ఎట్టెమ్మ ఆలయంలో మహిషాసురమర్దని.. ● జీడీనెల్లూరు: శాకంబరి అలంకారంలో అల్లియల్లమ్మ


శ్రీరంగరాజపురం: ఆరిమాను గంగమ్మకు పట్టువస్త్రాలు తెస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు


శ్రీరంగరాజపురం: పుల్లూరు కుప్పమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చనలో మహిళలు


పుత్తూరు: శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మహాచండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు


కలెక్టరేట్: గిరింపేట దుర్గాంబ దేవస్థానంలో పవళింపు సేవలో అమ్మవారు

దసరా వచ్చిందయ్యా..

నగరంలో కోలాహలం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలో దసరా పండుగ కోలాహలం నెలకొంది. విజయదశమి పండుగ నేపథ్యంలో నగరంలోని ప్రధాన వాణిజ్య వీధులు జనసంచారంతో కిక్కిరిశాయి. పూజా సామగ్రి, పండ్లు, పువ్వులు, కూరగాయల విక్రయాలు జోరుగా సాగాయి. దుర్గాష్టమి సందర్భంగా శుక్రవారం దుర్గాంబ దేవస్థానంలో భక్తులు దీపారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


చర్చివీధిలో పూజా సామగ్రి కొనుగోళ్లు


దుర్గాంబ దేవస్థానంలో దీపారాధనలో భక్తులు

ఆలయాల్లో నేడు దశమి వేడుకలు

విజయదశమి సందర్భంగా గిరింపేట దుర్గాంబ దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే గ్రామోత్సవంలో అమ్మవారు విజయలక్ష్మి అలంకరణతో పురవీధుల్లో విహరించనున్నారు. గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళ పరమేశ్వరి ఆలయంలో ఉదయం అమ్మవారు చందన అలంకారంలో, రాత్రి రాజరాజేశ్వరి అలంకరణలో అనుగ్రహించనున్నారు. శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో స్వామివారు శ్రీకృష్ణావతారంలో కటాక్షించనున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

పుత్తూరు, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు పేర్కొన్నారు. పుత్తూరుకు చెందిన నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి నాగరత్నం కుమారుడు వినీత్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని. . శుక్రవారం విజయబాబు పరామర్శించి దెబ్బతిన్న ద్విచక్ర వాహనాన్ని బాగుచేయిస్తానని చెప్పారు. ఆమె పెద్దకొడుకు కౌశిక్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు బాలాజీ నాయుడు, రవినాయుడు, పాండురంగయ్య, విజయ్ చౌదరి, సుబ్రహ్మణ్యం, కుమార్‌రెడ్డి ఉన్నారు.

నేడు శ్రీవారి కల్యాణోత్సవం


ఎమ్మెల్యే జగన్‌మోహన్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: పెరటాసి మాసం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ వేంకటేశాయ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు శుక్రవారం వారు అందజేశారు. స్థానిక కట్టమంచిలోని శాంతా రఘురామన్ కల్యాణ మండపంలో కల్యాణోత్సవం, మధ్యాహ్నం నడకదారి భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. తెదేపా నాయకులు వసంత్‌కుమార్, సభ్యులు ఈశ్వర్, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధితుడికి వీల్‌ఛైర్ అందజేత


అజయ్‌కు వీల్‌ఛైర్ అందజేస్తున్న యుగంధర్

పెనుమూరు, న్యూస్‌టుడే: సామిరెడ్డిపల్లె యానాది కాలనీకి చెందిన అజయ్ ఇటీవల మిద్దె పైనుంచి పడి గాయపడ్డాడు. అతడి కాళ్లు దెబ్బతిని నడవలేని స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ జనసేన బాధ్యుడు యుగంధర్ గురువారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించిన విషయం తెలిసిందే. శుక్రవారం మళ్లీ గ్రామానికి వెళ్లి అజయ్‌కు వీల్‌ఛైర్ వితరణగా అందజేశారు. మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రేణుక, ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, రాఘవ, అన్నామలై పాల్గొన్నారు.

వందనం.. రోడ్డు భద్రత పాటించండి.. నమస్కరించి చెబుతున్నాం. . వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించకండి.. పరిమితికి మించి ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది. రోడ్డు భద్రత నిబంధనలకు సహకరించండి అంటూ ఎస్సై రాజ్‌కుమార్ ప్రయాణికులకు విన్నవించారు. కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద పోలీసులు శుక్రవారం రోడ్డు భద్రతపై ప్రజలకు మర్యాదపూర్వకంగా అవగాహన కల్పించారు.

-న్యూస్‌టుడే, కార్వేటినగరం

శ్లాబ్ కూలింది..

ముందే హెచ్చరించిన 'ఈనాడు'


కూలిన పాత పాఠశాల భవనం శ్లాబ్

శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పాత పాఠశాల భవనం కూలేందుకు సిద్ధంగా ఉందని చిన్నారుల ప్రాణాలను కాపాడుకోవల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తూ.. 'పసిప్రాణాలతో చెలగాటమా..!' శీర్షికన చిత్రవార్తను 'ఈనాడు' ప్రచురించింది. మూడ్రోజులుగా కురుస్తున్న వర్షానికి శుక్రవారం పూర్తిగా భవనం శ్లాబ్ కూలిపోయింది. ప్రస్తుతం దసరా సెలవులు కావడం, శ్లాబ్ కూలే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులు వెంటనే అక్కడకు వచ్చి గ్రామస్థులు, చిన్నారులు ఇటుగా రావొద్దని గ్రామంలో దండోరా వేయించారు.

-న్యూస్‌టుడే, పాలసముద్రం

కుక్కలకు స్టెరిలైజేషన్ చేపట్టేందుకు చర్యలు



వాహనంలోకి ఎక్కించిన కుక్కలు

పట్టణంలో కుక్కల బెడదతో ప్రజల ఇబ్బందులపై గత నెల 28న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్.. తిరుపతి బ్లూ అనిమల్ కేర్ ద్వారా శుక్రవారం నుంచి పట్టణంలో కుక్కల పునరుత్పత్తి జరగకుండా వాటిని పట్టుకుని స్టెరిలైజేషన్ ప్రక్రియ ప్రారంభించారు. రామనాథశెట్టి కాలనీ, ధర్మరాజుల గుడివీధి, కాపు వీధి, రాజాజీవీధిలో వీటిని పట్టుకుని రేబిస్ టీకా, స్టెరిలైజేషన్ అనంతరం వాటిని వదిలేస్తున్నామని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పుత్తూరు


290 మందితో తిరుమలకు పాదయాత్ర


తిరుమలకు వెళ్తున్న గోవింద భక్తులు

పాలసముద్రం, న్యూస్‌టుడే: ప్రజలు శాంతియుతంగా ఉండాలంటే భక్తిభావం పెరగడంతోనే సాధ్యమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పాలసముద్రంలోని 13 పంచాయతీ గ్రామాల్లో 290 మంది గోవింద మాలధారణతో తిరుమలకు పాదయాత్రగా బయలు దేరారు. వారు మాట్లాడుతూ అహింస, ప్రేమ, సౌభ్రాతృత్వమే జీవిత మార్గాలన్నారు. ధర్మమార్గాలు అనుసరించినప్పుడే గ్రామాల్లో మంచి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నగరి, న్యూస్‌టుడే: బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ తిరుపతి సూపరింటెండెంట్ వసంత పిలుపునిచ్చారు. తపాలా వారోత్సవాల సందర్భంగా ఆమె పట్టణంలోని తపాలా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పథకాలు ఎస్‌బీ, టీడీ, ఆర్‌డీ, ఎస్ఎస్ఏ, ఆర్‌పీఐ, పీఎల్ఐ, ఈటీసీ.. ఎలా లాభదాయకమనేది వివరించారు. బీమా చేసి ఆపై మరణించిన తడుకుపేటకు చెందిన వ్యక్తి భార్యకు రూ.4,27,065 చెక్కు అందజేశారు. తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ పుత్తూరు సతీష్, నగరి ఏస్పీఎం కవిత, కౌన్సిలర్ దయానిధి, కాంగ్రెస్ నాయకుడు చిరంజీవిరెడ్డి, కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న సూపరింటెండెంట్ వసంత

చివరిరోజు ఎగబడ్డారు..

- 104 మద్యం దుకాణాలు.. 2,241 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.44.82 కోట్ల ఆదాయం

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వం నోటిఫై చేసిన 104 ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. గడువు పొడిగించడంతో వ్యాపారులు దరఖాస్తు చేయడానికి ఎగబడ్డారు. 104 మద్యం దుకాణాలకు 11 రోజుల్లో 2,241 దరఖాస్తులు అందాయి. కొందరు వర్గాలుగా ఏర్పడి పోటాపోటీగా దరఖాస్తులు వేశారు. శుక్రవారం ఒక్కరోజే 492 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వానికి రూ.44.82 కోట్ల ఆదాయం సమకూరింది. ఎన్నడూలేని విధంగా పాలసముద్రంలో ఒక మద్యం దుకాణానికి 82 దరఖాస్తుల రూపంలో రూ.1.64 కోట్ల ఆదాయం వచ్చింది. సరిహద్దుల్లోని యాదమరిలో మూడు దుకాణాలకు 97, గుడిపాలలో రెండింటికి 67, గుడుపల్లెలో ఒక దుకాణానికి 40 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని దుకాణాల్లో చిత్తూరు అర్బన్ పరిధిలోని 22 దుకాణాలకు 558, రూరల్ పరిధిలోని 19 దుకాణాలకు 464 దరఖాస్తులు అందగా, కుప్పంలోని 10 దుకాణాలకు 320 దరఖాస్తులు వచ్చాయి.

చిత్తూరులో 14న లాటరీ.. చిత్తూరు నగరం సంతపేటలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో ఈ నెల 14న ఉదయం 8 గంటలకు లాటరీ కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించనున్నారు. సీసీ కెమెరాలు, ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణలో జరగనుంది. ఇప్పటికే ఆర్ ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాట్లు పూర్తిచేశారు.


ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి చిత్తూరు అర్బన్ స్టేషన్‌లో క్యూలైన్‌లో దరఖాస్తుదారులు

పుత్తూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 230.. పుత్తూరు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం మండలాల పరిధిలో 18 దుకాణాలకు.. 230 మంది దరఖాస్తులు వచ్చాయని, రూ.4.6 కోట్లు ఆదాయం వచ్చిందని సీఐ మురళీమోహన్ తెలిపారు.

మనవి కాదుగా.. ఎలాపోతే మనకేంటి..?

- శిథిలావస్థలో ఆధునిక పరికరాలు
- ఉమ్మడి జిల్లాలో రూ.9.6 కోట్లు వృథా


ఎద్దులతో వేరుసెనగ విత్తు వేస్తున్న రైతు (పాత చిత్రం)


గంగాధర నెల్లూరు, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా.. పథకాలు అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా పరిణమిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 48 మండలాల్లో రూ.9.6 కోట్లకు పైగా వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునిక వ్యవసాయ పరికరాలు శిథిలావస్థకు చేరాయి. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు గతంలో ఆధునిక వ్యవసాయ పరికరాలను అప్పటి ప్రభుత్వం అందించింది. ఇందులో ట్రాక్టరు, నేల చదును చేసే పరికరం, వేరుసెనగ విత్తులు వేసే యంత్రం, దుక్కులు చేయడానికి మడకలు ఉన్నాయి. వీటిని తక్కువ అద్దెకు చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

పెరుగుతున్న ఖర్చులు..


జీడీనెల్లూరులో వృథాగా ట్రాక్టరు, ఆధునిక పరికరాలు

వ్యవసాయంలో ఆధునిక పరికరాల వినియోగ వ్యయం రోజురోజుకీ పెరుగుతోంది. మార్కెట్‌లో దుక్కులకు, వేరుసెనగ విత్తులకు, నేల చదునుకు ప్రైవేటు వ్యక్తులు ఎక్కువ బాడుగ అడగడంతో రైతులు విధిలేక పాత పద్ధతులైన ఎద్దులతో సాగు పనులు చేస్తున్నారు. తద్వారా ఖర్చులు ఏటా పెరుగుతూ రైతులపై మరింత భారం పడి. . చివరకు నష్టాలు చవిచూస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి..



సహకార సంఘాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ఆధునిక వ్యవసాయ పరికరాలను అధికారులు వినియోగంలోకి తెచ్చి, చిన్న, సన్నకారు రైతులకు తక్కువ అద్దెకు ఇవ్వాలి. తద్వారా మార్కెట్‌లో ఆధునిక వ్యవసాయ పరికరాల అద్దెలు నియంత్రణలో ఉండటంతో పాటు రైతులకు సాగు వ్యయం తగ్గి, వ్యవసాయం లాభసాటిగా మారే అవకాశం ఉంది. సహకార సంఘాల్లో దుర్వినియోగం, చోరీకి గురైన పరికరాలు గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- బాబునాయుడు, సహకార సంఘ ఉపాధ్యక్షులు, జీడీనెల్లూరు

యంత్రాలు మాయం..

- చిత్తూరు సహకార సంఘానికి అప్పట్లో సరఫరా చేసిన పరికరాలు చాలా ఏళ్ల వరకు నిరుపయోగంగా ఉన్నాయి. తర్వాత వీటిని జేడీఏ కార్యాలయ ఆవరణలో పడేశారు. ప్రస్తుతం అవి మూలకు చేరాయి.
- జీడీనెల్లూరు నియోజకవర్గ పరిధి వెదురుకుప్పం సహకార సంఘానికి ఇచ్చిన పరికరాలు చాలాకాలం వరకు నిరుపయోగంగా ఉన్నాయి. ఆ తర్వాత ఒక్కో యంత్రం ఆయా పార్టీల నేతలు సొంత పనులకు వినియోగించారు. వాటిని దుర్వినియోగం చేయడంతో ప్రస్తుతం వాటి ఆనవాళ్లు కూడా లేవు.
- కుప్పం నియోజకవర్గం శాంతిపురం వెలుగు కార్యాలయానికి 2008లో అందజేసిన రూ.20 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాల ఉనికి ప్రస్తుతం పత్తా లేదు. ఇవి వినియోగించకనే మాయమయ్యాయి.

ప్రభుత్వానికి నివేదిస్తాం

సహకార సంఘాల్లో నిరుపయోగంగా ఉన్న ఆధునిక పరికరాలపై ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రత్యేక విచారణ చేపట్టి దుర్వినియోగం, చోరీకి గురైనచోట బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. వాటిని స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ సూచనల మేరకు పరికరాలు రైతులు వినియోగించేలా చూస్తాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, చిత్తూరు

అధికారుల నిర్లక్ష్యం..

ఒక్కో సంఘానికి రూ.20 లక్షల విలువైన పరికరాలను అప్పగిస్తే, అధికారులు వీటిని పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో అవి సంఘాల ఆవరణలోనే ఏళ్ల తరబడి ఉండిపోయి శిథిలావస్థకు చేరాయి. కొన్ని సంఘాల్లో అధికార పార్టీ నేతలు సొంత పనులకు వినియోగించారు. మరికొన్ని సంఘాల్లో చోరీకు గురయ్యాయి. ఇంకొన్ని చోట్ల పరికరాలే కన్పించడం లేదు.



జగనన్న కాలనీలు చిట్టడవులను తలపిస్తున్నాయి. అధికారంలో ఉన్న సమయంలో జగనన్న కాలనీలు అంటూ.. తామే ఇళ్లు కట్టిస్తామని హామీ ఇవ్వటంతో ప్రజలు నమ్మి సొంతింటి కల సాకారం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. తీరా పట్టాలు ఇచ్చిన తరవాత తమవల్ల కాదని లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకోవాలని గత వైకాపా ప్రభుత్వం హుకుం జారీ చేసింది. దీంతో ప్రజలు అప్పులు చేసి కొంతమేర కట్టుకున్నా చివరకు భరించలేక ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆపివేశారు. చిత్తూరు శివారులోని దొడ్డిపల్లిలో కొండపై పట్టాలు ఇచ్చారు. వారికి కనీసం రోడ్డు వేయకపోగ, నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో ప్రస్తుతం కాలనీ అంతా చిట్టడవిగా మారింది. కనీసం మనిషి నడిచే దారి కూడా కనిపించటం లేదు.

-ఈనాడు, చిత్తూరు

సర్ది చెప్పిన వృద్ధుడిపై వ్యక్తి దాడి

ఎదపై బలమైన దెబ్బ తగలడంతో మృతి


వెంకటరమణ (పాతచిత్రం)

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: అమ్మవారికి బలి ఇచ్చిన మాంసం భాగ పంపకాల కోసం గొడవ వద్దని వారించిన వృద్ధుడిపై యువకుడి దాడి చేయగా.. అతను మృతి చెందారు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకోగా.. శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామ శివారులోని చెరువు కట్టపై వెలసిన గ్రామ దేవతలకు ఆ ప్రాంత వాసులు చిత్త పొంగళ్లు పెట్టారు. అందులో భాగంగా అమ్మవారికి మూగజీవాన్ని బలి ఇచ్చారు. ఆ మాంసం రాత్రికి భాగాలు వేస్తుండగా కొందరు గొడవ పెట్టుకున్నారు. ఈ విషయంలో గ్రామానికి వెంకటరమణ (62) పండగ పూట గొడవ వద్దని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. దీంతో ఆగ్రహించిన చీకలదిన్నెపల్లెకు చెందిన వాసు వృద్ధుడి ఎదపై కాలితో బలంగా తన్నాడు. వృద్ధుడికి బలమైన గాయం కావడంతో కిందపడి అపస్మారస్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సహదేవి విచారణ చేపట్టారు. దాడి చేసిన వాసు, గొడవకు కారణమైన వెంకటాచలపతి, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రామకుప్పం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని.. మినీ లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో బూరుగుమాకులపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గొల్లపల్లికి చెందిన సోమప్ప, బూరుగుమాకులపల్లికి చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త, పెద్ద గంగప్ప గౌడు(60)తో కలిసి వి.కోటకు బైక్‌పై బయల్దేరారు. కృష్ణగిరి నుంచి మదనపల్లెకి వెళ్తున్న మినీ లారీ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో గంగప్ప గౌడు అక్కడికక్కడే మృతి చెందగా సోమప్పకు తీవ్రగాయాలు అయ్యాయి. గంగప్ప కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రామకుప్పం ఇన్‌ఛార్జి ఎస్సై నరేశ్ కేసు నమోదు చేశారు.

ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు

చిత్తూరు (గ్రామీణ): ఆటో డ్రైవర్ల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ అధ్యక్షతన స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లందరూ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు రవి, దాసరి చంద్ర, రమాదేవి, డ్రైవర్ల యూనియన్ నాయకులు రఘు, ప్రకాష్, విజయచందర్, బాబు, జయచంద్ర, డ్రైవర్లు పాల్గొన్నారు.

నాటుతుపాకీ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: నెల్లిపట్ల సమీపంలోని నల్లగుట్లపల్లె అటవీ ప్రాంతంలో శుక్రవారం నాటుతుపాకీతో సంచరిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. తిమ్మయ్యగారిపల్లెకు చెందిన టి.రాజా, రఘునాయకులదిన్నెకు చెందిన జి.గజేంద్ర నాటు తుపాకీతో వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా వారిని నల్లగుట్లపల్లె సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి నాటు తుపాకీ, నల్లమందు, రవ్వలు, టార్చిలైట్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చిత్తూరుకు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండ్రోజుల క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం కడప కేఓఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలుపై విశాఖపట్నం ఘన విజయం సాధించింది. వైఎస్ఆర్ ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రకాశంతో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. చిత్తూరు మొదటి ఇన్నింగ్స్: 407/7 డిక్లేర్డ్.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని బొమ్మరాజుపల్లెలో శుక్రవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు చంద్రశేఖర్ (40) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. గురువారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో భార్యను వేడినీళ్లు పెట్టి ఇవ్వమని.. తాగి నిద్రపోయారు. అర్ధరాత్రి మెలకువ వచ్చిన చూడగా భర్త కనిపించలేదు. వెంటనే బంధువులు, చుట్టుపక్కల వారితో కలిసి గాలించగా గ్రామ శివారులో మామిడిచెట్టుకు ఉరేసుకుని కనిపించారు. వెంటనే పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చంద్రబాబు తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఈడిగపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని ఈడిగపల్లెకు లక్ష్మమ్మ (60) భర్త చనిపోవడంలో కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆమె కుమారుడు కూడా చనిపోవడంతో కోడలు వరలక్ష్మీతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో రాత్రి రోడ్డు పక్కన ఉన్న మందుల దుకాణంలో మాత్రలు తీసుకునేందుకు వెళ్తుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

దాదేపల్లెలో బ్యానర్ల గొడవ

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లెలో శుక్రవారం బ్యానర్ల గొడవ జరిగింది. గ్రామంలోని వైకాపా నాయకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. వీటిని చింపేశారని వైకాపా నాయకులు, తెదేపా బ్యానర్లు చించేశారని ఇరుపార్టీల శ్రేణులు ఆరోపణలు చేస్తూ ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. బ్యానర్లు కట్టరాదని హెచ్చరించారు. వివాదం పోలీసు స్టేషన్ వరకు చేరింది.

ద్విచక్రవాహనం చోరీ


బస్టాండు కూడలిలో అర్ధరాత్రి ముఖాలకు వస్త్రాలను చుట్టుకొని సంచరిస్తున్న యువకులు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ద్విచక్రవాహనాన్ని దొంగలు చోరీ చేశారు. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు కరస్పాండెంట్ రాజ్‌కుమార్.. బైక్‌ను ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉంచగా.. ముఖాలకు ముసుగులు ధరించిన ఇద్దరు యువకులు వాహనాన్ని చోరీ చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. 2 గంటల ప్రాంతంలో ముసుగులతో కేజీఎఫ్ రహదారిపై యువకులు సంచరించిన దృశ్యాలను గుర్తించారు. వి.కోట వైపు ఉడాయించినట్లు సీసీ ఫుటేజీలో నమోదైంది. ఈమేరకు రాళ్లబూదుగూరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

540 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం


మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక మసీదు వీధికి చెందిన పెద్దమల్లయ్య కుమారుడు రెడ్డెప్ప శుక్రవారం కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. రెడ్డెప్ప ఇంటి పక్కన పొదల్లో కర్ణాటక మద్యం నిల్వ చేసి విక్రయాలు చేస్తున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ.21,600 విలువైన 540 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

పలమనేరు
•పలమనేరు • కుప్పం •పుంగనూరు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఎం.కొత్తూరులో నూతన నడివీధి గంగమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు గణపతిపూజ, కలశస్థాపన, నవగ్రహ పూజ, రుద్ర హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, కలశాభిషేకం, పంచామృతాభిషేకం, కుంభాభిషేకం జరిపారు. గ్రామస్థులు అన్నదానం చేశారు.



అలంకరణలో శ్రీనడివీధి గంగమ్మ

ఏర్పాట్ల పరిశీలన

రామకుప్పం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ పర్యటన ఏర్పాట్లను తెదేపా నేతలు, కుప్పం గ్రామీణ సీఐ మల్లేశ్ యాదవ్ శుక్రవారం పరిశీలించారు. మొదటిసారి మండలానికి వస్తుండటంతో గ్రామాల్లో పర్యటించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని బొమ్మదొడ్డిరోడ్డులో కాలువలు లేక మురుగు రోడ్డుమీదే ప్రవహిస్తోంది. పక్కా కాలువలు నిర్మించకపోవడంతో ప్రజలు గుంతలు తవ్వుకుని మురుగు అందులో వదిలేస్తున్నారు. నిత్యం దుర్వాసనతో ఇబ్బందిగా మారింది. **-సుబ్రహ్మణ్యం, పలమనేరు**

సమాధానం: వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, పుర కమిషనర్**

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె పాఠశాల వీధిలో పక్కా కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల బెడద అధికంగా ఉంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- గుర్రప్ప, స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: కుప్పం-కమతమూరు దారిలో బైపాస్ కూడలి వద్ద చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు గుంతల్లో నీరు నిలిచి ఇబ్బందిగా మారింది. మరమ్మతులు చేపట్టాలి **- రమణ, కుప్పం**

సమాధానం: వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **- దస్తగిరి, డీఈఈ, ఆర్అండ్‌బీ**



సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తున్న తెదేపా నాయకుడు సురేష్‌బాబు

కుప్పంలో అభివృద్ధి పరుగులు

రామకుప్పం, న్యూస్‌టుడే: గత తెదేపా హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డుకుందని.. వాటిని తిరిగి ప్రారంభించినట్లు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని జౌకుపల్లిలో సీసీరోడ్లకు వారు భూమిపూజ చేసి మాట్లాడారు. చంద్రబాబు హయాంలో కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను త్వరలో పరుగులు తీయిస్తామని పేర్కొన్నారు. కక్ష సాధింపే లక్ష్యంగా వైకాపా పాలనలో కుప్పం అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కుప్పాన్ని ప్రత్యేకంగా గుర్తించేలా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, పత్రనారాయణ పాల్గొన్నారు.



వెంకటేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న తెదేపా నేతలు

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి నివాళి

రామకుప్పం, న్యూస్‌టుడే: మండలంలోని కొంగనపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేష్ (62) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయంపై తెదేపా జెండా ఉంచి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

సోమల, న్యూస్‌టుడే: రైతులు పంట మార్పిడి, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించచ్చని వేరుసెనగ దిగుబడి పరిశీలన అధికారి రవి, ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె పంచాయతీల్లో సాగుచేసిన వేరుసెనగను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పురుగు మందులు, ఎరువుల వాడకం, దిగుబడి తదితర వివరాలు సేకరించారు. అనంతరం ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఏవో సుధకార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాళికాదేవి.. కరుణించవమ్మా..!

పట్టణాలతో పాటు గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరుతున్నారు. తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసురమర్ధిని, కాళికాదేవి, నాగవల్లి, దుర్గాదేవి అలంకరణల్లో దర్శనమిచ్చారు. మహిళలే అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. **- న్యూస్‌టుడే, బృందం**



పలమనేరులో..



పుంగనూరు: వెన్న అలంకరణలో విరూపాక్షి మారెమ్మ ◆ పెద్దపంజాణి: నాగవల్లిగా.. ◆ రామకుప్పం: తమలపాకుల అలంకరణలో.. ◆ దేవళంపేట: అలంకరణలో స్వామివారు



బైరెడ్డిపల్లెలో కాళికాదేవిగా ◆ సదుం: అన్నపూర్ణదేవి అలంకరణలో.. ◆ కందూరులో శ్రీ కన్యకాపరమేశ్వరీ గ్రామోత్సవం ◆ కుప్పం: లక్ష్మీపురంలో రథోత్సవం

ఆ మలుపులు.. యమడేంజర్..!

ఈచిత్రంలోని ప్రమాదం సెప్టెంబరు 24న తమిళనాడు నుంచి ఆంధ్రాకు చింత గింజల లోడుతో వస్తున్న లారీ కుప్పం-క్రిష్ణగిరి జాతీయ రహదారిలో కుప్పం మండలం నడుమూరు ఆదర్శ పాఠశాల వద్ద ప్రమాదకర మలుపులో జరిగింది. ఈ సమయంలో వాహనాలు రాకపోవడంవల్ల పెనుప్రమాదం తప్పింది. ఈ మలుపులో నెలకు నాలుగైదు వాహనాలు బోల్తా పడుతున్నా... జాతీయ రహదారుల అధికారులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంలేదు. దీనివల్ల చాలా మంది బాధితులుగా మారుతున్నారు.



సూచికలు లేక ప్రమాదాలు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ మార్గాల్లోనేకాదు.. అంత రాష్ట్ర మార్గాల్లోనూ మలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల్లో వేగనిరోధకాలు, సూచికబోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు అదుపుతప్పి బోల్తాపడుతున్నారు. కుప్పం-క్రిష్ణగిరి జాతీయ రహదారితోపాటు కుప్పం-వేపనపల్లి ప్రధానమార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా అధికారులెవరూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడం లేదు.

సెప్టెంబరు 1న సాయంత్రం బెంగళూరు నుంచి కుప్పం వస్తూ కుప్పం-వేపనపల్లి ప్రధానమార్గంలో గంగాపురం ప్రమాదకర మలుపులో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రక్షణ స్తంభాలను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్పగాయాలతో బయటపడటంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ఈ మలుపులో సూచికలు లేకపోవడంతో వేపనపల్లి మార్గంలో కొత్తగా వచ్చే వాహనచోదకులు వేగంగా వస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.



పెద్దిరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

న్యూస్‌టుడే, బృందం: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం వైకాపా శ్రేణులు నిర్వహించాయి. పుంగనూరు, కల్లూరు, చౌడేపల్లె, బైరెడ్డిపల్లెలో కేకు కోసి అన్నదానం చేశారు. కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. పెద్దిరెడ్డి స్వగ్రామం సదుం మండలం యర్రాతివారిపల్లెకు విచ్చేశారు. జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బస్టాండులో కేకుకోసి పంచిపెట్టారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

దళితులపై దాడి అన్యాయం.. పలమనేరు: దళితులపై దాడి అన్యాయమని జాతీయ మానవ హక్కులు- అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డీవీ మునిరత్నం అన్నారు. శుక్రవారం పట్టణంలోని తమ కార్యాలయంలో మాట్లాడారు. వి.కోట మండలం మిట్టూరులో దళితుల మీద దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. సాంబశివ, ఆనంద, భూదేవి, సరస్వతి, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం.. బైరెడ్డిపల్లె: తీర్థం గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రథోత్సవం వైభవంగా జరిగింది. అర్చకుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణతో రథాన్ని లాగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో వరి పంట నష్టం.. కల్లూరు: రాయవారిపల్లె పంచాయతీ పాశంవారిపల్లె పొలాలపై గురువారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. రైతులు భాస్కర్, హరి సాగు చేసిన ఎకరా వరిని తొక్కి నాశనం చేశాయి. ఎఫ్ఎస్‌వో షఫీ, ఎఫ్‌బీవో మున్నా పరిశీలించి పరిహారం అందిస్తామన్నారు.

67 దరఖాస్తులు.. కల్లూరు: పులిచెర్ల ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలో మద్యం దుకాణాలకు 67 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ మాధవరావు స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. పులిచెర్ల- 35, రొంపిచెర్ల- 8, సదుం- 24 దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు.